క్లుప్తంగా

మంత్రికి సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం హైదరాబాద్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి దావోస్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని, రాష్ట్రానికి రూ.వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు ఉన్నారు.

చికెన్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఎంపీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. చికెన్ సెంటర్ల నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను రహదారుల పక్కన పడేస్తుండంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కుక్కల సంచారంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారని ఫిర్యాదులు అందయి. ఈ మేరకు చికెన్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి నోటీసులు అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో అవగాహన



నాటు వేస్తున్న విద్యార్థులు

ధర్మారం: తల్లిదండ్రులు చేస్తున్న వ్యవసాయ పనులపై పిల్లలకు అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక సాయి మణికంఠ హైస్కూల్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి మాట్లాడారు. పిల్లలు చదువు, ఫోన్లకు అలవాటు పడి తల్లిదండ్రులు పడే కష్టంపై అవగాహన చేసుకోలేక పోతున్నారని, అందుకే వ్యవసాయంపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

30న అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలో ఈనెల 30న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం శంకుస్థాపన, భూమిపూజ, పాండవుల గుట్ట, బీసీ భవనం, కస్తూరిబాగాంధీ విద్యాలయం అదనపు తరగతి గదులు, సీసీరోడ్లకు శంకుస్థాపన, మార్కెట్ గోదాం ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు కేతుపల్లి నరసింహారెడ్డి, ఆరెల్లి రమేశ్, సతీశ్, దేవేందర్, రాంచంద్రం, రవి, మొండయ్య, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి గ్రామస్తులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడారు. గత పదేళ్లుగా తమ గ్రామానికి ఎలాంటి సంక్షేమ పథకాలు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళలకు ఉచిత బస్సు, రుణమాఫీ వచ్చాయని వివరించారు. తాండ్ర సురేశ్, మల్లయ్య, పొన్నాల వేణు, చందు, మనోజ్, వంశీ, సాగర్, స్వామి, సంపత్, సజన్, జై బీమ్ నగర్ పాల్గొన్నారు.

కాండం తొలిచే పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు

- వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు డా.జి.శ్రీనివాస్



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

పెద్దపల్లిరూరల్: కాండం తొలిచే పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ పొలాస వ్యసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ రైతులకు సూచించారు. పెద్దపల్లి మండలంలోని కాసులపల్లికి చెందిన రైతు మల్లారెడ్డి సాగు చేస్తున్న నేరుగా విత్తే పద్ధతిలో వరి సాగును, వివిధ రైతుల సాగు చేస్తున్న వరి పంట పొలాలను ఈనెల 22న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు మాట్లాడారు.

అధికారుల సలహాలు, సూచనలు..

జిల్లాలో వరిపైరు పిలక దశ నుంచి దుబ్బు చేసే దశలో ఉందని, జిల్లావ్యాప్తంగా సాగు చేస్తున్న వరిలో ఉల్లికోడు, కాండం తొలిచే పురుగు ఆశిస్తుందని తెలిపారు. యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు అత్యంత సమస్యాత్మకంగా ఉందని, వరిలో ఆశించే కాండం తొలిచే పురుగు నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం శాస్త్రవేత్తల బృందం రైతులతో మాట్లాడి పంటసాగులో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. వాటికి సంబంధించిన తగు సూచనలు చేశారు. వరిలో కాండం తొలిచే పురుగు (మొవ్వ చనిపోయే దశ) ఎక్కువగా నష్టపరుస్తోందని గమనించినట్లు వారు పేర్కొన్నారు.

నివారణ చర్యలు..

- పురుగు ఉధృతిని గమనించడానికి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలి.
- ఎకరాకు 3 లింగాకర్షక బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25–30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- ముఖ్యంగా పురుగు నివారణకు సిఫారసు చేసిన ఇతర 10జి, సేంద్రియ గుళికలను యూరియాతో కలిపి వేయడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతు సోదరులు గమనించాలి.
- గత 2 నుంచి 3 ఏళ్ల నుంచి యాసంగిలో ఈ పురుగు పిలక దశలో ఆశించి ఎక్కువగా నష్టపరుస్తుంది. కాబట్టి నాటు వేసిన 15 నుంచి 20 రోజుల తర్వాత ఎకరానికి కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4జి 8కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3సిజి 10 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 4 కిలోలు బురద పదునులో వేయాలి.
- అలాగే జింకు లోప నివారణకు జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె నుంచి నాగారం వెళ్లే దారిలో కల్వర్ట్ వద్ద సాగునీరు రహదారిపై పారుతూ సాగునీరు వృథాగా పోతోంది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి అధికారులు పంట పొలాలకు సాగునీటిని వారబంధీగా సరఫరా చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాలువల్లో పూడిక, చెత్తా చెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కల్వర్లులు, డ్రాపుల వద్ద చెత్తా చెదారంతో నిండిపోవడంతో సాగునీరు రోడ్లపై పారుతూ సాగునీరు వృథాగా పోతోంది. దీంతో కాలువల చివరి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. కాలువల్లో చెత్త తొలగించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

హజ్రత్ తాజొద్దీన్ బాబా జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: హజ్రత్ తాజొద్దీన్ బాబా 164వ జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం స్థానిక సప్తగిరికాలనీలోని దర్గాలో నిర్వహించిన వేడుకల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి బాబాకు చాదర్ సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ముగింపు కార్యక్రమం..

హజ్రత్ తాజొద్దీన్ బాబా జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక కాకతీయనగర్‌లోని తాజొద్దీన్‌బాబా దర్గాలో నిర్వాహకులు నారదాసు సతీశ్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కేసీఆర్‌ను కలిసిన కొప్పుల, పుట్ట దంపతులు



మంథని: మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు– శైలజ దంపతులు మంగళవారం ఎర్రవెల్లి నివాసంలో కలిశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖను నిర్వీర్యం చేసేందుకే కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కేంద్రం అమల్లోకి తెచ్చిన నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలు సాగిస్తామన్నారు.

పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా ఆదిత్య..

పెద్దపల్లి పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఖరారు చేశారు. పట్టణ అధ్యక్షుడిగా ఆర్నకొండ ఆదిత్య, కార్యదర్శిగా అరవింద్, ఉపాధ్యక్షుడిగా బన్నీ, నరేశ్, మణిరత్నం, సహాయ కార్యదర్శులుగా అభిరాం, జ్ఞానేశ్వర్, రాజు, సభ్యులుగా మహేందర్, దిలీప్, మధును ఎన్నుకున్నారు.

ఉత్తమ అధికారికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఉత్తమ అధికారిగా ఎంపికైన జీడీకే–11 ఇంక్లైన్ గ్రూప్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్‌ను టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. 11 ఇంక్లైన్ టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ వాసర్ల జోసఫ్ ఆధ్వర్యంలో మంగళవారం గనిపై ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సన్మానించారు. నాయకులు చెల్పూరి సతీశ్, మొదుంపల్లి రాజేషం, పల్లె సురేందర్, రాసమల్ల సందీప్, రేండ్ల రవి, రామకృష్ణ, నరేశ్, సంతోష్, రవికిరణ్, మణిరాజ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



ట్రోఫీ, ప్రశంసా పత్రాలతో క్రీడాకారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో జరుగుతున్న క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎన్‌వైకే ప్రతినిధి రవీందర్ తెలిపారు. షఫీ, మహేశ్, గణేశ్, సిద్దార్థ ఉన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషిచేయాలి



మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి కల్పన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మంగళవారం వార్షిక వేడుకలను జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఇంటర్ నోడల్ అధికారి కల్పన హాజరై మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ మైత్రేయి, బాలుర కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నరహరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బట్టీల దుమ్ముధూళితోనే ప్రమాదాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్, రంగాపూర్ ప్రాంతాల్లోని ప్రధానరోడ్డుకు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితోనే ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. బట్టీల వద్ద ప్రహరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రవీందర్, శ్రావణ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• ముగ్గురిపై కేసు నమోదు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌లో డ్రైనేజీ పనులు చేస్తున్న కార్మికులపై సుభాష్‌నగర్‌కు చెందిన ముగ్గురు మంగళవారం దాడి చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన కొదడల మహేశ్ అనే కార్మికుడు ఇందిరానగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తుండగా పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఆరెపల్లి రాహుల్, వినయ్, ఆరెపల్లి కిరణ్ అకారణంగా కర్రలతో దాడి చేశారు. కాగా బాధితుడు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన నాంసాని రాజు (45) మంగళవారం ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానిక అమర్‌నగర్ ప్రాంతంలో ఓ ఫంక్షన్‌హాల్ నిర్వహించిన రాజు కొన్నినెలలుగా కమాన్ ప్రాంతంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు.

• గర్రెపల్లిలో..

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన పున్న రాజు(49)అనే డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజుకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. కాగా రాజు మద్యానికి బానిసయ్యాడు. 9న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందుర్తి, శానగొండ, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు.

• ప్రభావిత గ్రామాల నాయకుల ముందస్తు అరెస్ట్

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా పోలీసులు రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జెట్టి జ్యోతి, స్థానిక నాయకులను మంగళవారం ఉదయం అరెస్టు చేసి జైపూర్ పోలీస్‌స్టేషన్ తరలించారు. మాజీ కార్పొరేటర్ జెట్టి జ్యోతి మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో సమస్య పరిష్కారం కాదని ప్రభావిత గ్రామాలకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. స్థానిక నాయకులు అనుమాల భద్రయ్య, జెట్టి రమేశ్, దేవేందర్ ఉన్నారు.

• ఎరువుల దుకాణాలపై విచారణ జరపాలి

ముత్తారం: మండలంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు మొగిలి కిరణ్, చిగురు విద్యాసాగర్ కోరారు. మంగళవారం వారు మండల వ్యవసాయాధికారి అనూషకు వినతిపత్రం అందజేశారు.

• ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని జమాత్ ఇస్లామీ హింద్ సంఘం వైస్ ప్రెసిడెంట్, హెచ్ఎంఎస్ జాతీయ సంఘం నాయకుడు ఇస్మాయిల్ కోరారు. యైటింక్లయిన్‌కాలనీ షిర్కెబస్ స్టాప్ ఏరియా ఆటో యూనియన్ నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు.

• శంకర్ నాయక్‌కు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2ఏరియా ఐఎన్‌టీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శంకర్ నాయక్‌ను రాష్ట్ర లంబాడి ఐక్యవేదిక నాయకులు మంగళవారం సన్మానించారు. లంబాడి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, కిషన్ నాయక్, దుర్గా ప్రసాద్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

సింగరేణిలో మారుపేరు సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న తుమ్మల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణిలో మారుపేరు బాధితుల సమస్య పరిష్కరించి డిపెండెంట్‌లకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కొంతకాలంగా మారుపేరు సమస్యలు పరిష్కరిస్తామని కాలయాపన చేస్తూ ఇప్పటి వరకు పరిష్కరించలేదని ఆరోపించారు. కారుణ్య నియామకాల ద్వారా దిగిపోయిన మారుపేర్ల సింగరేణి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు రాక విజిలెన్స్ ఎంక్వయిరీ పేరుతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గుర్తింపు సంఘం సింగరేణి ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా మారుపేర్ల సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకుంటే సీఐటీయూ ఐక్య పోరాటాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆర్జీ–1 బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మండె శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు తోట నరహరిరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ ప్రతిమ

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ కోరారు. మంగళవారం ఆమె గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో శైలజారాణికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం రత్నాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని, అందులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో 133 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. 21న ప్రచురించి జాబితాలో ఉన్న అర్హులైన 10 మంది పేర్లు గ్రామసభ జాబితా నుంచి తొలగించారన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించాలన్నారు. గ్రామస్తులు కెక్కర్ల రాజేశ్వరి, సందనవేన కుమార్, సురేశ్, కెక్కర్ల మోహన్, కేశవేన మల్లేశ్, తొగురు అనిల్ ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై హర్షం



స్వీట్లు పంపిణీ చేస్తున్న లబ్ధిదారులు

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ సర్కార్ నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందచేయడంపై హర్ష వ్యక్తం చేస్తూ మంగళవారం అంకంపల్లెలో లబ్ధిదారులు స్వీట్లు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలుతో సీఎం రేవంత్ సర్కార్ పాలనపై భరోసా కలిగిందని మాజీ సర్పంచు ఆకుల చిరంజీవి అన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీతో మహిళలు, రైతు భరోసా రూ.6వేల విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మాజీ ప్రజా ప్రతినిధులు మొండయ్య, గాజుల మోహన్, లబ్ధిదారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కాల్వశ్రీరాంపూర్: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇటీవల ప్రజాపాలన గ్రామసభల్లో ప్రకటించిన నాలుగు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం వారు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు అర్హులందరికీ అందించేదాకా బీఆర్ఎస్ పక్షాన ఆందోళన చేపట్టనున్నట్లు మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు నిదానపురం దేవయ్య, జట్టి దేవేందర్, నాగార్జునరావు, శ్యాం, రాణి మోహన్, రమాదేవి రాయమల్లు, సువర్ణ చందు, సంధ్య, వెంకట్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీం, రవీందర్‌రెడ్డి, కొమురయ్య, వొడ్నాల శ్రీనివాస్, ఓదెలు, సారంగపాణి, నాగరాజు, తిరుపతి, నవీన్, సాంబరావు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మంథని చందు

మంథని: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై మంగళవారం మంథనిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షుడు మంథని చందు, జిల్లా అధికార ప్రతినిధి పొట్ల రమేశ్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్ కుమార్, మాదిగ కళాకారుల జిల్లా అధ్యక్షుడు ఏట రవి, కళాకారుల మంథని డివిజన్ అధ్యక్షుడు ఆరెపల్లి నాగరాజు, నాయకులు మంథని సత్యం, బూడిద శంకర్, బూడిద తిరుపతి, మంథని లక్ష్మణ్, తగరం శంకర్‌లాల్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయానికి సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలు అందిస్తున్న మార్వాడీ సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కట్టమైసమ్మ తల్లి ఆలయానికి మార్వాడీ సెవెన్ స్టార్ కమిటీ సభ్యులు మంగళవారం సీసీ కెమెరాలు అందజేశారు. ఎల్లమ్మ చెరువు కట్ట సమీపంలోని కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసేందుకు వీలుగా సీసీ కెమెరాలు అందించిన సభ్యులను అర్చకులు సత్కరించారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, గండు రంగయ్య, బూతగడ్డ సంపత్, భీమోజు సురేందర్, శ్రీనివాస్, మొగిలి ఉన్నారు.